క్లుప్తంగా

అయోధ్య అక్షింతల ఊరేగింపు



మాచర్ల రూరల్: హిందువుల ఆరాధ్య దైవమైన రాముని విగ్రహం అయోధ్యలో ప్రతిష్ట చేయటం మనందరికీ గర్వకారణమని ఆలయ అర్చకులు కేశవ, మురళి అన్నారు. గురువారం మండలంలోని కంభంపాడు గ్రామంలో అయోధ్య రామాలయ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులతో నిర్వహించిన ఊరేగింపులో భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన ప్రతిష్ట మహోత్సవం జరుపుకోవటం మనందరి అదృష్టమన్నారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో ఉంచుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో అలివేలమ్మ, వెంకటనర్సమ్మ, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులున్నారు.

ప్లాస్టిక్ మయంగా డ్రైనేజీలు



కారెంపూడి: డ్రైనేజీలు కారెంపూడిలో ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రవహిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి కాల్వల్లో మురుగు నీరు కూడా సక్రమంగా పారడం లేదు. అనేక చోట్ల మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. పారిశుధ్య కార్మికులు కూడా కాల్వల నుంచి వీటిని బయటకు తీయడానికి నానా కష్టాలు పడుతున్నారు. ప్లాస్టిక్‌తో ముడిపడిన నిత్యావసర వస్తు వినియోగం రోజురోజుకు పెరుగుతుండడంతో ఈ పరిస్థితి దాపురించింది. దీనిపై అప్రమత్తత లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని కారెంపూడికి చెందిన పర్యావరణ ప్రేమికుడు సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత కొమెర జాజి హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేత



పిడుగురాళ్ల: ఆరోగ్య శ్రీతో ఎంతో మేలు జరుగుతుందని కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి అన్నారు. పట్టణంలోని నెమలిరెడ్డి బజారు 1 సచివాలయంలో షేక్ ఖాజా మొహిద్దీన్‌కు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి చేతుల మీదుగా ఆరోగ్య శ్రీకార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిరుపేదలకు మేలు జరగాలని ఆరోగ్య శ్రీ పథకాన్ని తీసుకు వచ్చారని, టీడీపీ హయాంలో ఆ పథకం నీరు గారిందని, కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి నిరుపేదలకు మరింత మేలు జరిగేలా ఆరోగ్య శ్రీని రూపుదిద్దారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

మాచర్ల: పీఆర్కే, పీవీఆర్ నెహ్రూనగర్ యూత్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా పట్టణంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది ఎం.శ్రీనివాస్ శర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు ప్రదానం చేశారు. పోటీలో పాల్గొన్న 175 మందికి చీరలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరు నరసింహారావు, మాజీ చైర్మన్లు కిషోర్, రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కౌన్సిలర్ రామాంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా రైల్వేగేటు మూసివేత



పెదకూరపాడు: రద్దీగా ఉండే అమరావతి–సత్తెనపల్లి కాలచక్ర రహదారిలోని పెదకూరపాడు రైల్వే గేటును అధికారులు మరమ్మతుల పేరుతో ముందస్తు సమాచారం లేకుండా గురువారం మూసివేశారు. దీంతో సత్తెనపల్లి నుంచి పెదకూరపాడు, అమరావతి నుంచి సత్తెనపల్లి వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యవసాయ కూలీలు, రైతులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా గేటు ఎలా మూసివేస్తారంటూ రైల్వే అధికారులపై మండిపడ్డారు. దీంతో అమరావతి నుంచి సత్తెనపల్లి వైపు వెళ్లే వాహన చోదకులు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, పెదకూరపాడు నుంచి సిరిపురం, భట్లూరు మీదుగా, లగడపాడు నుచి సత్తెనపల్లి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు గేటు మూసి మరమ్మతులు చేస్తూనే ఉన్నారు.

తుదిదశలో మండల స్థాయి పోటీలు

- ఆడుదాం ఆంధ్రాకు అపూర్వ స్పందన: జెడ్పీ వైస్ చైర్మన్
- నువ్వానేనా అన్నట్లు తలపడుతున్న జట్లు
- కబడ్డీ విజేత జెట్టిపాలెం, వాలీబాల్ విజేత రెంటచింతల–1



కబడ్డీ ఫైనల్‌లో హోరాహోరీగా తలపడుతున్న జెట్టిపాలెం, తుమ్మకోట క్రీడాకారులు

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆయన ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కబడ్డీ, వాలీబాల్ ఫైనల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి చెందిన నైపుణ్యం కలిగిన విద్యార్థులు, యువత ఈ పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు తెలిపారు. పల్లె ప్రాంతాలకు చెందిన యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని వారిలో దాగిన క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. హోరాహోరీగా జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీలో జెట్టిపాలెం జట్టు, నువ్వానేనా అన్నట్లు సాగిన వాలీబాల్ ఫైనల్ పోటీలో పాలువాయి టీంపై రెంటచింతల–1 జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు చేరుకున్నట్లు పీఈటీ కత్తి రవి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షులు పూజల రామయ్య, మిట్టగుడిపాడు ఇన్‌చార్జి సర్పంచ్ గొట్టం వెంకటేశ్వరరెడ్డి, పీఈటీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ విజేత మాచవరం–2

మాచవరం: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీల్లో మాచవరం–2 సచివాలయం జట్టు విజయం సాధించినట్లు ఎంపీడీఓ యు.బి. వరప్రసాద్, సర్పంచ్ రాగిడి నరేష్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన గ్రామ స్థాయిలో గెలుపొందిన మాచవరం, పిన్నెల్లి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. గురువారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో పిన్నెల్లి జట్టుపై మాచవరం–2 జట్టు గెలుపొందినట్లు తెలిపారు. గెలిచిన జట్టు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. విజేత జట్టుకు పలువురు అభినందనలు తెలియజేశారు.



వాలీబాల్ ఫైనల్‌లో ఆడుతున్న రెంటచింతల-1, పాలువాయి గ్రామాల క్రీడాకారులు



ఫైనల్‌లో గెలిచిన రెంటచింతల వాలీబాల్ జట్టుతో జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీపీ చౌడేశ్వరి



మండలస్థాయి క్రికెట్‌లో విజయ సాధించిన మాచవరం-2 సచివాలయం జట్టు

13 ఏళ్లల్లో సాధించలేనిది 3 నెలల్లో సాధించాం

- సుందరయ్య కాలనీ వాసులకు పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: 13 ఏళ్లల్లో ఏ ప్రజాప్రతినిధులు సాధించలేనిది మూడు నెలల్లో సాధించామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణ 5వ వార్డు పరిధిలోని సుందరయ్య కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా వార్డు కౌన్సిలర్ నాగమణివెంకటరమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కాలనీ ప్రారంభంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కాలనీలోని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సభా వేదిక వద్దకు వెళ్లారు. మధ్యలో వికలాంగులు, వృద్ధులు వారి సమస్యలను తెలపటంతో తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సుందరయ్యకాలనీలో నివసిస్తున్న 220 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కాలనీలో గత 13, 15 సంవత్సరాలుగా నివసిస్తున్న మీ అందరికి ఒక పట్టా కూడా ఎవరు అందించలేదు, కేవలం మూడు నెలల క్రితం సుందరయ్య కాలనీకి వచ్చిన సమయంలో కాలనీ వాసులకు పట్టాలు కావాలని తన దృష్టికి తీసుకొని రావటం జరిగిందని, వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేసి సర్వే నిర్వహించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయటంతోపాటు అక్క చెల్లెమ్మలకు తన చేతుల మీదుగా అందించటం జరిగిందని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు. కేవలం ఇళ్ల పట్టాలే కాదు సొంత ఇంటి కలను కూడా నెరవేరుస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వార్డు కౌన్సిలర్ నాగమణి వెంకట రమణ, కౌన్సిలర్లు అజ్మీర శారద, వాసుదేవరెడ్డి, ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యాముల్, బ్రహ్మం, జానిబాషా, అప్పారావు, అనసూర్య, కవిత, లక్ష్మి, తిరపతమ్మ, కుమారి, కృష్ణవేణి, హుస్సేనమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్లు స్వామి, జాషువా, ఎండీ లతీఫ్, పవన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మాచర్ల : పట్టణంలోని స్వామి వివేకానంద ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో నెహ్రూనగర్ 2వ లైనులో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్టు బోర్డు వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, నాసరయ్య, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలు మృతదేహాన్ని స్వయంగా శ్మశానవాటికకు తీసుకెళ్లి కార్యక్రమాలు నిర్వహించారు. వారి సేవలను పలువురు కొనియాడారు.

కంది ధర ఆశాజనకం



దుర్గి: రైతులు తాము పండించిన కందులను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే విక్రయించి మంచి ధరను పొందాలని మండల వ్యవసాయ శాఖాధికారి వై.అమీర్‌రెడ్డి గురువారం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రోజు మార్కెట్ ధరను దృష్టిలో ఉంచుకొని కందులను కొనుగోలు చేస్తుందన్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.9,385గా నిర్ణయించిందన్నారు. ప్రమాణాలు పాటిస్తూ ఈకెవైసీ ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులకు అమ్మి నష్టపోవద్దని రైతులను కోరారు. ఈ నెలాఖరులోపు మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

కులగణన పారదర్శకంగా చేయాలి



మాచవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి 28 వరకు కులగణన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహనా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి గ్రామాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమ నిర్వహణపై గ్రామ స్థాయిలో అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమం మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

అయోధ్య రాముడి ప్రతిష్టాపన చిరస్మరణీయం

జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి



జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీపీ చౌడేశ్వరిలకు అయోధ్య అక్షింతలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

రెంటచింతల: అయోధ్యలో ఆలయ ప్రతిష్టాపన చిరస్మరణీయమని జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయనకు, ఎంపీపీ దాసరి చౌడేశ్వరికి పార్టీ నేతలకు స్థానిక రామాలయం కమిటీ సభ్యులు అయోధ్య రాముడి అక్షింతలు అందజేసిన నేపథ్యంలో నర్సిరెడ్డి మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలోని భవ్యమందిరంలో జరగనున్న బాలరాముడి ప్రాణప్రతిష్ట దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షులు పూజల రామయ్య, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఎంపీటీసీ గుంటా ముక్కంటేశ్వరరెడ్డి, రామాయలం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట నమోదు సకాలంలో చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి

పిడుగురాళ్ల: రబీ పంట కాలంలో పంట వేసిన ప్రతి ఒక్క రైతుకు పంట నమోదు కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి సూచించారు. పట్టణ జానపాడు రోడ్డులోని కేఎం కన్వెన్షన్ హాల్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ఉద్యోగులకు సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న వేసవిలో రైతులు ఇంకుడు గుంతలు తీసుకోవాలంటే అటువంటి రైతుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.జె.బెన్నీ మాట్లాడుతూ రైతులకు ఉద్యాన శాఖ అందించే పలు రకాల పథకాలు, వాటికి సంబంధించిన సబ్సిడీల గురించి రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. ఆర్‌బీకేల్లోని ఉద్యాన సహాయకులు ఈ పథకాల గురించి రైతులకు తెలియజేయాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించటం జరిగిందని, కందులకు మద్దతు ధర ప్రకటించటంతోపాటు గన్నీ, లేబరు, రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.సాయిమార్కొండారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాల గురించి ప్రతి రైతుకు తెలియాలని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. అపరాల సాగుపై రైతులకు అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమానికి పిడుగురాళ్ల ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయలు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

మాచర్ల: పల్నాడు జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులను చైతన్య పరిచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు చేసిన అభివృద్ధి గురించి గ్రామ గ్రామాన ప్రచారం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళికి సూచించారు. గురువారం పట్టణంలోని కోదండరామాలయంలో వ్యవసాయ శాఖ ఏడీఏ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో క్రాప్ నమోదు, రైతుల వివరాలతోపాటు రైతులను ప్రభుత్వం ఏవిధంగా ఆదుకుంటుందనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, ఏడీఏ వెటర్నరీ జగదీష్, హార్టికల్చర్ అధికారి సురేష్, సచివాలయ పరిధిలో కార్యక్రమాల అమలు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాచర్ల ఎరువులు, విత్తనాల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో గ్రామస్తులకు హెల్త్ కార్డులు అందజేస్తున్న అధికారులు

మాచవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ అన్నారు. మండలంలోని పిన్నెల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి, పథకాలు అందని వారిని క్షేత్రస్థాయిలో గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంగళరావు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- డ్రైవర్స్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: శివారు కాలనీల రూపు రేఖలు మార్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేనని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం వారికి అందించిన లబ్ధి, పథకాల గురించి వివరించారు. స్థానికులు కొందరు రోడ్లు, డ్రైనేజి, లైట్లు వంటి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రావటంతో వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివసించే ప్రాంతాలు, శివారు కాలనీలు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని, అలాగే గురజాల నియోజకవర్గంలోని పట్టణాల్లో ఉన్న శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించటం జరిగిందన్నారు. జగనన్న కాలనీలకు కూడా మౌలిక వసతులు కల్పించి గృహాలు నిర్మించటం జరిగిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.3471 కోట్లతో అభివృద్ధి చేయటం జరిగిందని తెలిపారు. అలాగే సమీపంలో మెడికల్ కళాశాల, వైద్యశాల నిర్మాణం జరుగుతుందని, ఇది పూర్తి అయితే 600 పడకల హాస్పిటల్ అందుబాటులోకి వస్తుందని, పేదలకు ఉచితంగా వైద్యం అందుతుందని తెలిపారు. విద్య, వైద్యం ప్రతి పేదవాడికి అందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వార్డు కౌన్సిలర్ బడిగుంతల నాగమణి వెంకట రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పొందుగుల లక్ష్మారెడ్డి, గద్దెల సామేలు, షేక్ బాషా, మరియబాబు, వెంకటేశ్వర్లు, శ్రీను, సామ్రాజ్యం, కౌసల్య, గోగుల లక్ష్మి, పసుపులేటి నాగలక్ష్మి, పుల్లమ్మ, గౌషా, మౌలాలిబేగం తదితరులున్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి



మాట్లాడుతున్న మండల పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, ఎంపీడీఓ సరోజనీదేవి

గురజాల : మండలంలో ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టబోయే పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలన్నారు. సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది అందరూ సమష్టిగా అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, కావూరి అంజిబాబు, ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధిపై సమగ్ర నివేదిక తయారు చేయాలి

మాచర్ల రూరల్: రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలపై ఉద్యోగులు, సమగ్ర నివేదికను తయారు చేసి గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పని చేయాలని మండల పార్టీ సీనియర్ నాయకులు బూడిద శ్రీనివాసరావు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి గ్రామాలలో చేయాల్సిన అభివృద్ధి పనులపై 15వ ఆర్థిక సంఘానికి అందించే నివేదికను తయారు చేయటంలో పంచాయతీ అధికారులు ప్రతి గ్రామంలో కచ్చితమైన అవసరాలను గుర్తించటమే కాకుండా రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను తయారు చేసి అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజనీదేవి, పంచాయతీరాజ్ ఏఈ రామాయణం సురేంద్ర, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు



తుమ్మకోట గ్రామస్తులకు పలు సూచనలు చేస్తున్న ఎస్ఐ నారాయణరెడ్డి

తుమ్మకోట(రెంటచింతల): గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కైపు వెంకట నారాయణరెడ్డి హెచ్చరించారు. పల్నాడు జిల్లా రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురజాల డీఎస్పీ పల్లపురాజు సూచనలతో గురువారం కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ నేతృత్వంలో మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులతో ఎస్ఐ నారాయణరెడ్డి మాట్లాడారు. ద్విచక్ర వాహనం ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. తెలంగాణ మద్యం, గుట్కాలు అమ్మడం, సరఫరా చేయడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. లోన్ యాప్‌లు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మీకు తెలియని నెంబర్ల నుంచి కాల్ వస్తే ఓటీపీ చెప్పవద్దని సూచించారు. సెల్‌ఫోన్లకు వచ్చిన వివిధ రకాల మెసేజ్‌లకు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నివారణలో పోలీసు వారితో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడం కోసం పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం చేద్దాం .. పెట్టుబడులు తగ్గిద్దాం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ముల్లంగి పంటను పరిశీలిస్తున్న అమలకుమారి

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయం చేసి ప్రకృతిని కాపాడుకునేందుకు రైతులు ముందుకు రావాలని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి అన్నారు. పెదకూరపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళ రైతు మట్టుపల్లి ఉదయలక్ష్మి మిరప పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఉదయలక్ష్మి ప్రకృతి వ్యవసాయం చేసి మంచి లాభాలు ఆర్జిస్తుందన్నారు. మిరప పంటలో అంతర్ పంటగా ముల్లంగి, ఉల్లి, బంతి, క్యారెట్ వేసి మంచి దిగుబడి సాధించారన్నారు. ఎటువంటి రసాయనాలు లేని ఆరోగ్యకరమైన కూరగాయలు పండిస్తున్న ఉదయలక్ష్మిని అభినందించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడం వల్ల పెట్టుబడి తగ్గుతోందన్నారు. భూమి సారవంతమై నీటి నిల్వ పెరుగుతోందన్నారు. కూరగాయాలు, దుంప పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తోందన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం ఎన్ఎస్ఏఎస్‌సీ సైదయ్య, ఎం.నందకుమార్, సత్తెనపల్లి డివిజన్ అధికారి మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జి అమూల్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.